సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 30 । జూన్ । 2024



సోమశిలలో 10.119 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 10.119 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 384 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.73,920
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,638
3శాతం జీఎస్టీతో	రూ.6,837
నవర (8గ్రా)	రూ.54,696



వాతావరణం

వాతావరణంలో తేమ 76 శాతం ఉంది. జిల్లాలో ఆదివారం పగటి వాతావరణం వేడిగా ఉంటుంది. ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా డాక్టర్ కె.సునీత



వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా డాక్టర్ కె.సునీత శనివారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్‌గా ఉన్న డాక్టర్ పి.రామచంద్రారెడ్డి అధికార పార్టీ రాజకీయ ఒత్తిడితో రాజీనామా చేయడంతో ఆ స్థానంలో వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగం సహాయ ఆచార్యులు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ఉన్న డాక్టర్ కె.సునీతను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఎస్‌యూ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

అందుబాటులో బీపీటీ వరి విత్తనాలు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో బీపీటీ-5204 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ లలితాశివజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కేజీల బస్తా రూ.1,260లకు అందజేస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సేద్య విభాగం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డిని సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 79816 44675 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మార్కుల జాబితాలు వెబ్‌సైట్ www. bseap. ap. gov. in అందుబాటులో ఉన్నట్లు డీఈఓ పీవీజే రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు లాగిన్ ద్వారా విద్యార్థుల హాల్ టికెట్ ఉపయోగించి మార్కుల జాబితాను పొందవచ్చన్నారు. మార్కుల జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ప్రధానోపాధ్యాయుల సరైన డాక్యుమెంట్స్‌తో ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు వచ్చేనెల 6వ తేదీలోపు పంపాలన్నారు.

రేపు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 24న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని, జూలై 1వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

పప్పుల నిల్వలపై పరిమితి ఆంక్షలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో వివిధ రకాల పప్పుల నిల్వలపై పరిమితులు విధిస్తూ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కందిపప్పు, శనగ పప్పు, కాబూలి శనగ పప్పులపై స్టాక్ పరిమితులు విధించారు. టోకు వ్యాపారుల వద్ద ప్రతి రకం పప్పు 200 మెట్రిక్ టన్నులు, రిటైలర్ వద్ద 5 మెట్రిక్ టన్నులు, పెద్ద చైన్ రిటైలర్లు అవుట్‌లెట్ వద్ద 5 మెట్రిక్ టన్నులు, డిపోల్లో 200 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు ఉండాలన్నారు. ఇక మిల్లర్ల వద్ద అయితే 3 నెలల ఉత్పత్తి లేదా, వార్షిక స్థాపిత సామర్థ్యంలో 25 శాతం ఏది ఎక్కువైతే అది, దిగుమతిదారులు కస్టమ్ క్లియరెన్స్ తేదీ నుంచి 45 రోజులకు మించి దిగుమతి చేసుకున్న స్టాక్ కలిగి ఉండకూడదన్నారు. ఈ విధంగా వ్యాపారులు, మిల్లర్లు వద్ద ఉన్న స్టాక్ వినియోగదారుల వ్యవహారాల శాఖ పోర్టల్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఒక వేళ సూచించిన పరిమితుల కంటే ఎక్కువ ఉన్నట్లైతే జూలై 12వ తేదీ నాటికి నిర్దేశించిన పరిమితులకు లోబడి పప్పు ధాన్యాల స్టాక్ క్రమం తప్పకుండా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో కాబూలి శనగతో సహా కందిపప్పు శనగపప్పుల వ్యాపారం చేసే హోల్ సేలర్లు, రిటైలర్లు, మిల్లులు, దిగుమతిదారులు స్టాక్ డిక్లరేషన్‌ను నిర్ధారించాలని విజయవాడ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించారని, 12వ తేదీ తర్వాత నిర్దేశించిన పరిమితులు అతిక్రమించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

భరోసా.. నిరాశే

సేద్యానికి సాగు పెట్టుబడి సాయంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి భరోసా దొరకని పరిస్థితి నెలకొంది. 'వైఎస్సార్ రైతు భరోసా' పేరును 'అన్నదాత సుఖీభవ'గా మార్చినా.. రైతుల తలరాత మారే పరిస్థితి కనిపించడం లేదు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో నాలుగేళ్లకే ప్రకటించిన రైతు భరోసా పథకాన్ని తొలి ఏడాదితో కలిపి ఐదేళ్లు అమలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కంటే అదనంగా పెట్టుబడి సాయాన్ని పెంచారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' సాయం ఎప్పుడిస్తుందనే దానిపై ఇంత వరకు చెప్పలేదు.

- గత ఐదు విడతలుగా రైతుల ఖాతాల్లో వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ
- కరోనా విపత్తు వేళ సాకులు చెప్పకుండా ఆదుకున్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మేనిఫెస్టోలో నాలుగేళ్లకే ప్రకటించినా.. ఐదేళ్లు సాయం ఇచ్చిన వైనం
- మొత్తం రూ.1,510.70 కోట్ల సాయం అందజేత
- రైతులకు సాయం హామీపై మాట మార్చిన కూటమి ప్రభుత్వం
- సీజన్ దాటిపోతున్నా.. ఈ ఏడాది ఇంత వరకు జమ కాని నగదు



నెల్లూరు (సెంట్రల్): రాష్ట్ర మంతటా గడిచిన ఐదేళ్లు రైతు కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. సాగుకు పెట్టుబడి భరోసా దక్కింది. పంట సాగుకు పెట్టుబడులు మొదలుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసాతో సాయాన్ని అందించేందుకు సంకల్పించారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్‌తో కలిపి రూ.12,500 ఇస్తామని, ఈ పథకాన్ని ప్రభుత్వం ఏర్పాటైన మరుసటి ఏడాది నుంచి ఇస్తామని వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చాక సాయాన్ని రూ.13,500లకు పెంచడంతో పాటు తొలి ఏడాది నుంచే ఈ పథకాన్ని అమలు చేసి రైతులపై తనకు అభిమానాన్ని చాటుకున్నారు. గడిచిన ఐదేళ్లుగా క్యాలెండర్ ప్రకటించి అందించారు. వివిధ కారణాలతో రైతు భరోసా పథకానికి అర్హులు కాలేకపోయిన వారి సమస్యలు పరిష్కరించి.. మరీ సాయం అందించిన వైనాన్ని రైతులు గుర్తుచేస్తున్నారు. ఈ పథకాన్ని భూ యజమానులకే కాకుండా కౌలు రైతులకు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోంది. రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్ రైతు భరోసా పథకమే కాకుండా అనేక పథకాల ద్వారా ఆదుకున్నారు. ప్రధానంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి రైతులకు చేదోడు వాదోడుగా నిలిచారు.



సంవత్సరం	మొత్తం రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లల్లో)
2019-20	2,02,306	రూ.273.11
2020-21	2,43,502	రూ.328.72
2021-22	2,43,911	రూ.329.27
2022-23	2,14,667	రూ.289.80
2023-24	2,14,667	రూ.289.80

నెల్లూరు జిల్లా నుంచే పథకం ప్రారంభం

రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ పెట్టుబడి కింద అందించే వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని 2019 అక్టోబరు 15వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ప్రారంభించారు. వాస్తవానికి 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇస్తామని అప్పట్లో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. కానీ ఏడాది ముందే అందజేశారు. అయితే మేనిఫెస్టోలో రూ.12,500 ఇస్తామని ప్రకటించినా.. పథకం ప్రారంభం రోజు రూ.13,500 ఇస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై అప్పటి టీడీపీ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. పీఎం కిసాన్‌తో కలిపి ఇస్తానని ముందు చెప్పలేదు.. ఇప్పుడు పీఎం కిసాన్ రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 సాయం అందిస్తుందంటూ విమర్శలు గుప్పించారు.

ఐదేళ్లలో జిల్లాలో రూ.1,510.70 కోట్లు

గడిచిన ఐదేళ్లలో జిల్లాలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు రూ.1,510.70 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. ఏటా ముందుగానే నిర్దిష్ట తేదీ ప్రకటించి సాయం అందించారు. అప్పటి ప్రభుత్వంలో పలానా తేదీ రైతు భరోసా పడుతుందనే భరోసా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ఇప్పుడు నాలిక మడతేసిన చంద్రబాబు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఏటా రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామంటూ మేనిఫెస్టోలో ప్రకటించారు. ఎన్నికలయ్యాక.. టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు ఇప్పుడు నాలిక మడతేశారు. పీఎం కిసాన్ మొత్తంతో కలిపి రూ.20 వేలు అంటూ చెబుతున్నారు. చంద్రబాబు రైతులను ఇలా మరో సారి మోసం చేయడంపై మండిపడుతున్నారు. రైతులను కదిలిస్తే.. గతంలో రైతు రుణ మాఫీ చేస్తామంటూ హామీలిచ్చి ఇలాగే మోసం చేశాడని, మరోసారి చంద్రబాబు మాటలు నమ్మినందుకు విచారిస్తున్నామని అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఆ ఇస్తామన్న అన్నదాత సుఖీభవ మొత్తం కూడా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల వంతున ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు త్వరితగతిన చెల్లించేలా చర్యలు

- మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- హాస్టల్స్‌లో భోజనం సరిగా ఉండడంలేదు
- అధికారుల్లో స్పందన లేదు
- రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, చిత్రంలో డిప్యూటీ సీఈఓ చిరంజీవి

నెల్లూరు (పొగతోట): గృహ నిర్మాణాలకు సంబంధించి భూములను చదును చేసిన బిల్లులను త్వరితగతిన చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్లులు త్వరగా మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు చైర్‌పర్సన్‌ను, అధికారులను కోరారు. హౌసింగ్ పీడీ నాగరాజు మాట్లాడుతూ బిల్లుల చెల్లింపు విషయం మాకు సంబంధం లేదన్నారు. ఇప్పటి వరకు రూ.570 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. మిగిలిన బిల్లులతో తమ శాఖకు ఎటువంటి సంబంధం లేదని హౌసింగ్ ఎండీ తెల్పి చెప్పారన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.1.80 లక్షలకు ప్రతి గృహ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిందేని తెలిపారు. గృహ నిర్మాణాలు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా ఉండే కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హాస్టల్స్‌లో భోజన నాణ్యతను అధికారులు పట్టించుకోరా?

చైర్‌పర్సన్ మాట్లాడుతూ హాస్టల్స్‌లో భోజనం సరిగా ఉండడం లేదన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి అనేక పర్యాయాలు తీసుకువచ్చిన వారిలో స్పందన లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భవనాల నిర్మాణాలు వేగవంతం చేయండి

అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల్లో ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అధికారులను ప్రశ్నించారు. నిధులు అందుబాటులో ఉండి నిర్మాణాలు చేపట్టమని సూచించినా పట్టించుకోరా? అని అసహనం వ్యక్తం చేశారు. అద్దె భవనాల్లో ఎంత కాలం ఉంటారు.. సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో 659 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. 342 భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. 539 విలేజ్ క్లినిక్స్‌కు 152 నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. 659 రైతు భరోసా కేంద్రాలకు 254 భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకంతో చేపట్టిన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ద్వారా చేపట్టిన భవన నిర్మాణాలు పూర్తి చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని సూచించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

మహిళల ఆర్థిక ప్రగతి కోసం రూ.వందల కోట్ల బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి రుణాలు మంజూరు చేశామన్నారు. మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి వారి ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కులం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు.

తాగునీటి పథకాలు అందుబాటులోకి తీసుకురండి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. నిర్మాణాలు పూర్తి చేసిన తాగునీటి పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తాగునీటి పథకాల నిర్మాణాలు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ సీజన్ నాటికి ఇరిగేషన్ ట్యాంక్‌లు, కాలువల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, చిన్నపిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ సభ్యులు సూచించిన సమస్యలను త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశాల్లో జెడ్పీ డిప్యూటీ సీఈఓ చిరంజీవి, వివిధ మండలాలు జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హంస వాహనంపై రామలింగేశ్వరుడి చిద్విలాసం



హంస వాహనంపై దర్శనమిచ్చిన రామలింగేశ్వరుడు

విడవలూరు: మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరుడు శనివారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక వాహనంపై స్వామి అమ్మవార్లను కొలువుదీర్చి ప్రత్యేక పూల అలంకరణ చేసి, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యనిర్వహణాధికారులు రామకృష్ణ, సిబ్బంది వెంకటేశ్వర్లు అర్చకులు శ్రీకాంత్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాల్లో చెల్లించొచ్చని ఏపీఎస్పీడీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పని చేస్తాయని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్‌అదాలత్‌లో 3,201 కేసుల పరిష్కారం



కక్షిదారులకు చెక్కును అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

- కక్షిదారులకు రూ.3,35,46,217 చెల్లింపు

నెల్లూరు (లీగల్): జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ కోర్టుల్లో శనివారం 3,201 కేసులు న్యాయమూర్తుల సమక్షంలో పరిష్కారం అయ్యాయి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో కేసుల్లో ఉన్న కక్షిదారులకు సంబంధించి రూ.3,35,46,217 పరిహారంగా చెల్లింపులు చేశారు. జిల్లా కోర్టు అవరణలోని న్యాయ సేవాభవన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ సి.యామిని లోక్ అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. కక్షిదారులు రాజీ పడి వస్తే లోక్ అదాలత్‌లో సత్వరం న్యాయం అందించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు అప్పీల్ ఉండదన్నారు. ఈ సందర్భంగా ప్రమాదాల కేసుల్లోని బాధితులకు నష్టపరిహారం చెక్కును అందజేశారు. నెల్లూరు కోర్టులో జరిగిన లోక్ అదాలత్ ప్రత్యేకంగా 8 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు జి.కబర్థి, ఎస్.శ్రీనివాస్, భరద్వాజా, ఎల్.శారదరెడ్డి, జి.దేవిక, టి.భాస్కర్, టి.సుయోధన్, ఎల్.లావణ్య ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి 1,658 కేసులను పరిష్కరించారు. గూడూరు కోర్టులో 34, కోవూరులో 424, కావలిలో 138, కోటలో 420, సూళ్లూరుపేటలో 149, ఆత్మకూరులో 141, ఉదయగిరిలో 35 కేసులను పరిష్కరించారు. రాష్ట్రంలో అత్యధికంగా కేసుల పరిష్కారంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.వాణి పర్యవేక్షణలో జరిగిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఇన్స్యూరెన్స్, బ్యాంక్, పోలీసు అధికారులు, కక్షిదారులు తదితరలు పాల్గొన్నారు.



కావలి: సబ్‌కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి శోభ

కావలి కోర్టుల్లో 138 కేసుల పరిష్కారం

కావలి: కావలి సబ్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 138 కేసులకు పరిష్కారం లభించింది. లోక్‌అదాలత్ సీనియర్ చైర్మన్, సివిల్ జడ్జి ఎం.శోభ, స్పెషల్ మేజిస్ట్రేట్ పి పరుసురాం, జూనియర్ సివిల్ జడ్జి ఈ. సుధాకర్ సివిల్, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్‌లకు సంబంధించి మొత్తం 138 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా త్వరితగతిన కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీ మృదుల, కావలి న్యాయవాద సంఘం అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

- నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీవారికి తేనెతో జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు.

క్లుప్తంగా

కోనేరులో పడి వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో గల చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో వ్యక్తి శనివారం మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. నెల్లూరులోని ములుమూడి బస్టాండ్ సెంటర్‌కు చెందిన నవీన్ (45) ఇద్దరు స్నేహితులతో కలసి గంగపట్నానికి ఆటోలో వచ్చారు. ఈ క్రమంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ముందు ముగ్గురూ కలిసి స్నానం చేసేందుకు కోనేరులో దిగారు. ఈ తరుణంలో నీటిలో నవీన్ మునిగిపోయారు. స్నేహితులు కేకలేయడంతో సమీపాన ఉన్న వారు నవీన్‌ను బయటకు తీశారు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం మైపాడులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని నెల్లూరు తరలించారు. కాగా దీనిపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వివాహిత శనివారం మృతి చెందారు. వివరాలు.. అనంతసాగరం మండలంలోని వడ్డిపాళేనికి చెందిన మల్లి శ్రీరాములు, అనూష దంపతులు తమ పిల్లల స్కూల్ ఫీజును చెల్లించేందుకు ద్విచక్ర వాహనంపై ఈ నెల 26న బయల్దేరారు. ఈ క్రమంలో కారు ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



ఆత్మకూరు(చేజర్ల): అటవీ ప్రాంతంలో సంచరించే చుక్కల దుప్పి ఓ రైతుకు సంబంధించిన గొర్రెల మందలోకి శుక్రవారం సాయంత్రం చేరింది. దీన్ని గమనించిన రైతు అటవీ శాఖ అధికారులకు తెలియజేసి దాన్ని క్షేమంగా కండలేరు జూ పార్కుకు తరలించిన ఘటన చేజర్ల మండలంలోని నాగలవెల్లటూరులో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బానాల రవికుమార్ తన గొర్రెలను మేత నిమిత్తం అటవీ ప్రాంతానికి శుక్రవారం తోలుకెళ్లారు. సాయంత్రం గొర్రెలు ఇంటికి చేరుకునే క్రమంలో వాటిలో ఓ చుక్కల దుప్పి కలిసి ఉండటాన్ని గుర్తించారు. దాన్ని జాగ్రత్తగా ఇంటికి తరలించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రాపూరు అటవీ శాఖ బీట్ అధికారి భాగ్యరాజా గ్రామానికి చేరుకొని చుక్కల దుప్పిని ప్రత్యేక వాహనంలో కండలేరు జూ పార్కుకు తరలించారు.

కారు అద్దాలు ధ్వంసం



ఉదయగిరి: పట్టణంలోని సుద్దబావి వీధిలో గల ఓ ఇంటి వద్ద నిలిపి ఉన్న కారు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. డ్రైవర్ రమేష్ వివరాల మేరకు.. కారును నిలిపి ఇంట్లో నిద్రించారు. శనివారం ఉదయానికి కారు అద్దాలను ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించారు. ఇలాంటి ఆగంతకులపై పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన భక్తులతో శనివారం కిక్కిరిసింది. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. అభిషేకం, సుప్రభాతం, పూలంగి సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని జరిపారు. ఊంజల్ సేవను రాత్రి నిర్వహించారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు ఐదు, పిన్నేరువాగుకు పది, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

జెనరిక్‌కే జై..

ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రజలు వినియోగించే మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వైద్యులు సూచించే 90 శాతం ఔషధాలు ఇదే తరహాలో ఉంటున్నాయి. ఈ క్రమంలో ఆరోగ్యం బాగోలేని నిరుపేదలు, మధ్యతరగతి జీవులు తమ సంపాదనలో అధిక శాతాన్ని వీటికి ఖర్చు చేయలేక అల్లాడిపోతున్నారు. ఇలాంటి వారి కోసం మార్కెట్లో అత్యంత చౌక ధరలకే జెనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయి. కేవలం జెనరిక్ పేరుతోనే మందులను విక్రయిస్తున్న దుకాణాలున్నాయి. బ్రాండెడ్ కంపెనీలు తయారు చేసే ఔషధమైనా.. జెనరిక్ రూపంలో ఉన్న మందైనా ఒకే తరహాలో ఉంటుంది.

చౌక ధరలకే లభిస్తున్న మందులు

- జిల్లాలో 37 షాపులు
- పనిచేసే విధానం ఒకటే



రెడ్‌క్రాస్ సంజీవని జెనరిక్ మందుల షాపు

నెల్లూరు(అర్బన్): వైద్యులు సూచించే మందులకు భారీగా డబ్బులను వెచ్చించలేని వారి సౌకర్యార్థం జెనరిక్ మందుల షాపులు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా గుండె జబ్బు, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులున్న వారు మాత్రలకే నెలకు రూ.ఏడు వేల నుంచి రూ.పది వేల వరకు వెచ్చిస్తున్నారంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ తరుణంలో నాణ్యమైన ఔషధాలను తక్కువ ధరకే అందించాలనే సంకల్పంతో జన ఔషధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రారంభించింది. పేదలకు తక్కువ ఖర్చుకే మందులను అందించాలనే ఉద్దేశంతో జెనరిక్ షాపులను రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 1500 రిటైల్, 650 వరకు హోల్‌సేల్ షాపులున్నాయి. మరోవైపు పొదుపు సంఘాల ద్వారా నాలుగు, ప్రధానమంత్రి జన ఔషధి జెనరిక్ షాపులు ఏడు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మద్రాస్ బస్టాండ్ వద్ద ఒకటి, ఇతర వ్యాపారులు 25 కలిపి మొత్తం 37 జెనరిక్ షాపులను నిర్వహిస్తున్నారు. ఇవే కాకుండా సాధారణ మెడికల్ షాపుల్లోనూ జెనరిక్ మందులను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

వామ్మో.. ఇంత తేడానా..?

ఉదాహరణకు కొన్ని జెనరిక్ మందులను పరిశీలిస్తే తేడాలు ఎలా ఉంటాయో అర్థమవుతుంది. నరాల నొప్పులకు సంబంధించిన గాబాపెంటిన్ అనే మందు.. రెడ్‌క్రాస్ సంజీవిని జెనరిక్ షాపులో గాబానిల్ – ఎన్టీ రూపంలో లభ్యమవుతుంది. పది మాత్రల ఎమ్మార్పీ రూ.190 కాగా విక్రయించేది మాత్రం రూ.40కే. అదే షాపులో ఎల్డర్ కంపెనీకి చెందిన నికొరాండల్ ఐదు మిల్లీగ్రాముల మాత్రల డబ్బా ఎమ్మార్పీ రూ.330 కాగా, విక్రయించేది రూ.32కు మాత్రమే. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. బ్రాండెడ్ కంపెనీలు ఈ మందులను జెనరిక్ కన్నా ఎక్కువకు విక్రయిస్తున్నాయి.



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో..

దాదాపు అన్ని మందులు అందుబాటులో..

దీర్ఘకాలిక రోగాలతో పాటు బీపీ, షుగర్, కేన్సర్ ఇన్‌ఫెక్షన్లు, జీర్ణాశయ సమస్యలు, పలు ఆపరేషన్లలో అవసరమయ్యే ఇంజెక్షన్లు సైతం జెనరిక్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ బ్రాండెడ్‌తో పోలిస్తే 100 నుంచి 200 శాతం తక్కువకే అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్‌తో పోలిస్తే జెనరిక్ మందుల విక్రయాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం 25 శాతానికి పైగా మార్కెట్‌ను ఆక్రమించాయి. ఈ ప్రభావం బ్రాండెడ్ మందులపై పడింది. కాస్త పెద్ద కంపెనీలు అందించే జెనరిక్ మందులను కొనుగోలు చేస్తే బాగుంటుందని ఆరోగ్యవేత్తలు సూచిస్తున్నారు.


సమానంగా పనిచేస్తాయి



బ్రాండెడ్, జెనరిక్ మందులు సమానంగా పనిచేస్తాయి. ప్రభుత్వాస్పత్రుల్లో సైతం జెనరిక్ మందులే ఉంటాయి. శాంపిళ్లను సేకరించి మందు మోతాదును పరిశీలిస్తున్నాం. ర్యాన్‌బ్యాక్సీ, సిప్లా, రెడ్డీస్, ఎల్డర్, వాకాడిన్ ఇలా పేరున్న పలు కంపెనీలు జెనరిక్ మందులను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిని వాడితే ఇబ్బంది ఉండదు. వైద్యులు వీటిని సిఫార్సు చేయాలి. దీని ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు లభ్యమవుతాయి.

– వీరకుమార్‌రెడ్డి, ఏడీ, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ

జెనరిక్ షాపులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది



జెనరిక్ షాపులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తక్కువ ధరకే అక్కడ మందులు లభ్యమవుతున్నా యి. దీని వల్ల పేద, మధ్య తరగతి వారికి ఎంతో మేలు జరుగుతోంది. జెనరిక్ మందులను విరివిగా ఉపయోగించాలి.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

ఉదయగిరి దుర్గంపై విస్తృత తనిఖీలు

- గుప్తనిధుల తవ్వకాల సామగ్రి స్వాధీనం

ఉదయగిరి: ఉదయగిరి దుర్గం పరిసర అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు కొంతకాలంగా తవ్వకాలు చేస్తున్నారనే సమాచారంతో అటవీ శాఖ సిబ్బంది విస్తృత తనిఖీలను చేపట్టారు. తవ్వకాల కోసం ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి వెల్లడించారు. ఉదయగిరి దుర్గం పరిసర అటవీ ప్రాంతంలో కొందరు అక్కడే మకాం వేసి గుప్తనిధుల కోసం తవ్వకాలు సాగిస్తున్నారు. అందిన సమాచారంతో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పడి పెద్ద, చిన్న మసీదులు, కోటలు, గుర్రపు శాలలు తదితర ప్రాంతాల్లో వారం రోజులుగా కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో పెద్ద మసీదు సమీపంలో ఉన్న చిన్న కోనేరు వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారనే అంశాన్ని గుర్తించారు. దీంతో పరిసర ప్రాంతంలో పరిశీలించి.. తవ్వకాలకు ఉపయోగించిన డ్రిల్లర్లు, సమ్మెట, ఇనుపరాడ్లు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్, పురావస్తు శాఖ అధికారులతో కలిసి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి గుప్తనిధుల ముఠా ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలువురు అనుమానితులను గుర్తించామని, వీరికి నోటీసులిచ్చి విచారణ జరుపుతామన్నారు. డీఆర్వోలు ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



గుప్తనిధుల తవ్వకాల కోసం ఉపయోగించిన సామగ్రితో అధికారులు

యువకుడిపై హత్యాయత్నం

కలిగిరి: యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. వింజమూరుకు చెందిన ఖాజారహంతుల్లాకు కలెక్టరేట్లో ఉద్యోగం ఇప్పిస్తానని కలిగిరికి చెందిన చీమలదిన్నె మాల్యాద్రి నమ్మించి నగదును వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా, ఉద్యోగాన్ని ఇప్పించకపోవడంతో తన నగదును తిరిగివ్వాలని మాల్యాద్రిని ఖాజారహంతుల్లా అడగసాగారు. ఈ క్రమంలో మాల్యాద్రి ఇంటికెళ్లి నిలదీయడంతో ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ తరుణంలో డబ్బులు తీసుకునేందుకు కలిగిరికి శుక్రవారం ఉదయం రావాలంటూ ఖాజారహంతుల్లాకు మాల్యాద్రి తన స్నేహితుడు పద్మనాభంతో కలిసి ఫోన్ చేశారు. వింజమూరు రోడ్డులోని కొయ్యలమిల్లు వెనుక ఉన్న లేఅవుట్‌లో మాల్యాద్రి, పద్మనాభం మద్యం సేవించసాగారు. అక్కడ నగదు విషయమై మరోసారి వివాదం జరిగింది. దీంతో పద్మనాభం తన వెంట బాటిల్‌లో తీసుకొచ్చిన పెట్రోల్‌ను ఖాజారహంతుల్లా కాళ్లపై పోసి నిప్పంటించారు. మంటలను ఆర్పి పరుగులు తీస్తూ కలిగిరి పీహెచ్‌సీకి బాధితుడు చేరుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మాల్యాద్రి, పద్మనాభాన్ని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మర్రిపాడు: లారీ ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మర్రిపాడులోని నెల్లూరు – ముంబై రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బద్వేల్ వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లారీ మర్రిపాడు వద్ద రోడ్డు దాటుతున్న సైదుల్లా (27)ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాథ్ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని నెల్లూరు క్లబ్‌లో జిల్లా స్థాయి క్యారమ్స్, క్లబ్ టోర్నీని జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. డబుల్స్ విభాగంలో శనివారం నిర్వహించిన పోటీల్లో సురేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి జట్టు సురేష్‌రెడ్డి, డేనియల్ దివాకర్‌పై 25 – 00, 25 – 04 పాయింట్లతో విజయం సాధించి ఫైనల్స్ చేరారు. సింగిల్స్‌లో చిన్నివాసు, బర్నబాసు ఫైనల్స్ చేరుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. టోర్నీ ఆదివారంతో ముగియనుందని, మొదటి



పది ర్యాంకులను ప్రకటించనున్నామని అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

హనుమంత వాహనంపై మహావిష్ణు విహారం



పూజలు చేస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. స్వామివారు హనుమంత వాహనంపై శనివారం విహరించారు. భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థాన స్థానాచార్యుడు శ్రీమాన్ కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. మహాకుంభారాధన, నిత్యహోమం, నివేదన, శాత్తుమురై, మహాలక్ష్మికి అభిషేకం, లక్ష్మీయాగం తదితరాలను విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వాయుగుండ్ల వెంకటశివమణికంఠ, విద్యాలక్ష్మి, సోమశేఖర్, వాసంతి, దాసరి ఆంజనేయులు, రంజని దంపతులు, చేర్రోలు లక్ష్మీనారాయణ వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు, శంకరన్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.